క్లుప్తంగా

శివాజీపాలెంలో ఫాగింగ్



ఫాగింగ్ చేస్తున్న మలేరియా సిబ్బంది

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెంలో మలేరియా విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఫాగింగ్ నిర్వహించారు. ఈ ప్రాంతంలో సాయంత్రం వేళల్లో దోమల ఉధృతి అధికంగా ఉండటంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు చర్యలు చేపట్టారు. శివాజీపాలెం పార్కు రోడ్డు, హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం, వినాయకుడి గుడి,ఎంవీవీ భవన్ ప్రాంతాల్లో జీవీఎంసీ మలేరియా సిబ్బంది ఫాగింగ్ చేశారు.

పిఠాపురం కాలనీలో అంధకారం



పిఠాపురం కాలనీ సర్వీస్ రోడ్డులో అలుముకున్న చీకట్లు

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలో అంధకారం అలుముకుంది. కాలనీలోని సర్వీస్ రోడ్డులో బుధవారం వీధిలైట్లు వెలగలేదు. దీంతో ఈ రోడ్డులో చీకట్లు కమ్ముకున్నాయి. ఈ మార్గం ఎప్పుడు రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలతో నిండిపోయి ఉంటుంది. ఈ వాహనాల వద్ద ఆకతాయిలు, మందుబాబులు చేరి ఆగడాలు సృష్టిస్తుంటారు. అలాంటి రోడ్డులో వీధి దీపాలు వెలగకపోవడంతో కాలనీ వాసులు రాకపోకలు చేయడానికి భయపడుతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి పిఠాపురం కాలనీ సర్వీస్ రోడ్డులో విద్యుత్ లైట్లు వెలిగించాలని నివాసులు కోరుతున్నారు.

కిశోర బాలికల ఆరోగ్య సంరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీవో శ్రీలత

సీతమ్మధార: కిశోర బాలికల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించినట్లు ఏసీడీపీవో శ్రీలత తెలిపారు. విశాఖ అర్బన్ పరిధి ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు మే 2 నుంచి జూన్ 10 వరకు వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా బుధవారం నక్కవానిపాలెం జీవీఎంసీ ప్రైమరీ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల హక్కు లు, చట్టాలపై వివరించారు. బాల్య వివాహాల కట్టడి, బాలికల అక్రమ రవాణా నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై చర్చించారు. సూపర్‌వైజర్ కుమారి, బి.మమత, బి.శకుంతల, ఎస్.సాయి కుమారి, బి.గౌరి తదితరులు పాల్గొన్నారు.

అభయ దుర్గాదేవికి పూజలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని అభయ దుర్గాదేవి ఆలయ ఏడో వార్షికోత్సవం కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు.

పూర్ణామార్కెట్ వద్ద పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు



పూర్ణామార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీస్ ఔట్‌పోస్ట్

జగదాంబ: పూర్ణామార్కెట్ వద్ద పోలీసు ఔట్ పోస్ట్ ఏర్పాటు చేశారు. ఎండా కాలం కావడంతో ట్రాఫిక్ పోలీసుల కోసం దీన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ర్యాష్ డ్రైవింగ్, డోంట్ డ్రింక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, హెల్మెట్ వాడకంతో పాటు పలు ట్రాఫిక్ నిబంధనలు ప్రస్తావిస్తూ దీన్ని ఏర్పాటు చేశారు. మార్కెట్ ప్రధాన రహదారి, వన్‌టౌన్‌కు వెళ్లే దారిలో దీన్ని ఏర్పాటు చేయడంతో అందరినీ ఆకట్టుకుంటోంది.

దుర్గంధభరితం



16వ వార్డులో అధ్వానంగా కాలువ



కేఆర్‌ఎం కాలనీ ప్రధాన కాలువలో పెద్ద ఎత్తున పేరుకుపోయిన పూడికలు



గణేష్‌నగర్ కాలువలో నిలిచిపోయిన మురుగు

• 16, 23 వార్డుల్లో పూడికలతో నిండిన పెద్ద కాలువలు • పేరుకుపోయిన చెత్తతో స్థానికుల ఇక్కట్లు • పట్టించుకోని పారిశుధ్య సిబ్బంది

మద్దిలపాలెం: **జీవీఎంసీ 16, 23 వార్డుల్లోని ఏ కాలువను చూసినా పూడికలు, చెత్తాచెదారంతో నిం**డిపోయి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. స్మార్ట్ సిటీగా రూపాంతరం చెందుతున్న గ్రేటర్ విశాఖలో పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల వీధుల్లోని ఏ కాలువలోనూ సక్రమంగా పూడికలు తొలగించడలేదు. మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా కాలువల ఆధునికీకరణలో భాగంగా కాంక్రీట్ **వేశారు. నీటి ప్రవాహానికి అడ్డంగా ఉండే పూడికలను ఎప్పటికప్పుడు తొలగిరేచడాన్ని జీవీఎంసీ** పారిశుధ్య సిబ్బంది విస్మరించడంతో ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. పెద్ద కాలువల్లో పేరుకుపోయిన పూడికలను సకాలంలో తొలగించకపోవడంతో దుర్గంధభరితంగా తయారయ్యాయి.

దోమలు, ఈగల బెడద : పెద్ద కాలువలను **శుభ్రం చేయకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికల వల్ల** పగటి పూట ఈగల మోత.. సాయంత్రం, రాత్రి వేళల్లో దోమల బెడదతో సతమతమవుతున్నారు. కాలువలు, రోడ్ల మీద చెత్త కుప్పలపై వాలుతున్న ఈగలు ఇళ్లలోని ఆహార పదార్థాలపై చేరడంతో వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని నివాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రమయ్యే సరికి దోమలు గుంపులుగా దాడి చేస్తూ రోగాల బారిన పడేస్తున్నాయని వాపోతున్నారు.

సకాలంలో పూడికలు తొలగించాలి

జీవీఎంసీ 16, 23 వార్డుల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని కాలనీల వాసులు కోరుతున్నారు. సంబంధి అధికారులు వార్డుల్లో పర్యటించి పారిశుధ్య సిబ్బంది పనితీరును పరిశీలించాలని, చెత్త సేకరణ వాహనాలను పెంచాలని సూచిస్తున్నారు. పారిశుధ్య సమస్యపై దృష్టి సారించి రోడ్లపై చెత్త పేరుకుపోకుండా చూడాలని, సకాలంలో కాలువలు, గెడ్డలను శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పడకేసిన పారిశుధ్యం

నగరం నడిబొడ్డున ఉన్న మద్దిలపాలెంలో పారిశుధ్యం పడకేసింది. ఇక్కడ ముంపు ప్రాంతంగా గుర్తించిన కేఆర్‌ఎం కాలనీలోని ప్రధాన కాలువ పరిస్థితి మరీ దారుణం. చిన్నపాటి వర్షానికే ఈ కాలువ పొంగిపొర్లుతోంది. దీనిలో చెత్త విపరీతంగా పేరుకుపోయినా.. పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో ప్రధాన కాలువ నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. కేఆర్‌ఎం కాలనీ, గణేష్‌నగర్ తదితర ప్రాంతాల్లో నివసించే వారు చెత్తను ఇష్టానుసారంగా కాలువల్లో వేస్తుండటంతో మురుగు నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. సకాలంలో పూడికలు తీయకపోవడంతో చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. దీని నుంచి వస్తున్న దుర్వాసనను భరించలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు. కాలువల పక్కగా రాకపోకలు సాగించాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు.

గాలివానకు విరిగిన చెట్లు





22వ వార్డు పిఠాపురం కాలనీ రహదారులపై నిలిచిన వర్షపు నీరు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కురిసిన గాలివానకు చెట్లు విరిగిపోయాయి. రోడ్డుపై విరిగిపడిన చెట్ల కొమ్మల వల్ల బుధవారం వాహన రాకపోకలకు ఆటంకంగా మారాయి. జీవీఎంసీ జోన్ -2 కమిషనర్ కనక మహాలక్ష్మి ఆరిలోవ ప్రాంతంలో పర్యటించి, వాటిని పరిశీలించా రు. చెట్లు విరిగిపడిన చోట్ల వాటిని సిబ్బందితో వెంటనే తొలగించారు. దీంతో కొంతసేపటికి వాహనాల రాకపోకలకు ఆటంకం తొలగింది.



ఆరిలోవలో విరిగిన చెట్టు కొమ్మ

ఊరటనిచ్చిన వాన

మద్దిలపాలెం: అకాల వర్షం స్థానిక ప్రజలకు ఊరటనిచ్చింది. బుధవారం వేకువజాము నుంచి చిన్న చిన్ని చినుకులతో ప్రారంభమైన వాన.. మధ్యాహ్నం గంట పాటు ఏకధాటిగా కురిసింది. దీంతో 22వ వార్డులో పిఠాపురం కాలనీ తదితర లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. వేసవి తాపంతో ఉక్కిరిబిక్కిరవుతున్న తరుణంలో వాన కురవడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు.

తీరంలో ఈదురు గాలులు



రుషికొండ తీరం వద్ద నిలిపివేసిన స్పీడ్ బోట్లు

కొమ్మాది: తీరంలో మంగళవారం అర్ధరాత్రి ఈదురుగాలులు వీచాయి. పెనుగాలులు, వర్షంతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. మంగమారిపేట, ఉప్పాడ, రుషికొండ, సాగర్‌నగర్ ప్రాంతాల్లో సుమారు 4 గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బుధవారం కూడా వాతావరణం ప్రతికూలంగా ఉండడంతో రుషికొండలోని టూరిజం స్పీడ్ బోట్ల నిర్వహణ నిలిపివేశారు. కెరటాలు పెద్ద ఎత్తున ఎగసిపడటంతో బీచ్‌ల వద్ద లైఫ్‌గార్డులు పర్యాటకులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు.

చేపల వ్యాను బోల్తా



సాగర్‌నగర్ రోడ్డులో బోల్తా పడిన వ్యాను

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట నుంచి నగరం వైపుగా వెళ్తున్న చేపల వ్యాను సాగర్‌నగర్ అంధుల పాఠశాల సమీపంలో అదుపు తప్పి బోల్తాపడింది. ఇక్కడ మలుపు వద్ద వ్యాను ఒక్కసారిగా అదుపు తప్పడంతో, డివైడర్‌ను ఢీ కొట్టింది. వ్యాను నడుపుతున్న డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. ఆరిలోవ ట్రాఫిక్ సీఐ కె.ఎన్.ఎస్ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారతీయ నృత్యానికి విశ్వవ్యాప్త ఆదరణ



శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేసిన కళాకారులతో నిర్వాహకులు, అతిథులు

డాబాగార్డెన్స్: భారతీయ నృత్యానికి విశ్వవ్యాప్తంగా ఆదరణ ఉందని శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేస్ అధ్యక్షురాలు పైడి రజని అన్నారు. ఇంటర్నేషనల్ డ్యాన్స్ డే సందర్భంగా బుధవారం కాళీ మాతా మందిరం వద్ద శాస్త్రీయ నృత్య పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ శాస్త్రీయ నృత్యం అన్ని వర్గాల వారి ఆదరణ చూరగొంటుందన్నారు. దీనిని నేటి తరం ప్రోత్సహించాలని కోరారు. ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వై.సోమలత మాట్లాడుతూ పాశ్చాత్య దేశాల నృత్యం వైపు నేటి యువత మొగ్గు చూపుతుందన్నారు. చిరకాలం నిలిచేది శాస్త్రీయ నృత్యమేనన్నారు. పలు విశ్వ విద్యాలయాల్లో శాస్త్రీయ నృత్యంపై ఉన్న కోర్సులు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని చెప్పారు. శాస్త్రీయ నృత్య దర్శకురాలు లీలా జగన్ మాట్లాడుతూ శాస్త్రీయ నృత్యానికి ఉన్న ఆదరణ ఎప్పటికీ చెరిగిపోదన్నారు. కార్యక్రమంలో పి.మౌనిక, కె.రుత్విక్, నేహానాయక్, లక్ష్మీ కార్తీక, డి.దక్షిత, ప్రణవ, గ్రీష్మ, దీక్షాశ్రీ, స్నేహాంజలి, భువనేశ్వరి, నృత్య దర్శకురాలు సౌందర్య సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

డాబాగార్డెన్స్: ఒరిస్సా స్టీవర్స్ షిప్పింగ్ కంపెనీ వ్యవస్థాపకుడు మహిమానంద మిశ్రా 72వ జన్మదినం సందర్భంగా నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించిందని సంస్థ ఉపాధ్యక్షుడు జె.కె.నాయక్ తెలిపారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో బుధవారం వన్ టౌన్‌లోని కంపెనీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 88 మంది రక్తం దానం చేసినట్లు చెప్పారు.

‘మల్లం’ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదుకు డిమాండ్



నిరసన తెలుపుతున్న దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పారావు, నాయకులు

కంచరపాలెం: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లం గ్రామంలో జరిగిన దళితుల సాంఘిక బహిష్కరణపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు హెచ్చరించారు. ఈ ఘటనపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఊర్వశి జంక్షన్‌లోని దళిత సేన కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురం మల్లంలో మూడు రోజుల పాటు దళితులను వెలివేసిన ఘటనపై జిల్లా అధికారుల తీరు సరికాదన్నారు. విద్యుత్ ప్రమాదం వల్ల మరణించిన పల్లపు సురేష్ కుటుంబానికి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని, మృతుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగమివ్వాలని కోరారు. దీనికి కారకులైన నిందితులను కాపాడుతున్న అధికారులపై కూడా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సేన సిటీ కన్వీనర్ గొల్లమాల మీన, నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారాం, ప్రధాన కార్యదర్శి చింతల మల్లికార్జున, నగర కార్యదర్శి పట్నాల ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మేడే వేడుకల్లో పాల్గొన్న వామనమూర్తి తదితరులు

అల్లిపురం: డ్రైవర్లకు భారీగా జరిమానాలు విధించే 21,31 జీవోను రద్దు చేసి, డ్రైవ్లందరికీ పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ అనుబంధ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి డిమాండ్ చేశారు. 139వ మే డే సందర్భంగా రైల్వేస్టేషన్ ఎదుట బుధవారం నిర్వహించిన మేడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటో కార్మికుడు కె. చంటి మేడే పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం 1886 మే 1న అమెరికా దేశం చికాగో నగరంలో కార్మికవర్గం 8 గంటల పని విధానం అమలు చేయాలని పోరాడి అమరులైన అమర జీవులకు జోహార్లు అర్పించారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో బాబు అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెంచి డ్రైవర్లకు ఆహార భద్రత లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్ల హక్కులను హరిస్తే ప్రభుత్వాల పతనం తప్పదని హెచ్చరించారు. మే 20న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో ఆటో డ్రైవర్లు, మోటార్ వాహన డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వాల కళ్లు తెరిపించాలని డ్రైవర్లకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మేడేని సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

• బీఆర్‌టీఎస్ రహదారిలో వృక్షాల కనువిందు



ఆరిలోవ ప్రాంత బీఆర్‌టీఎస్ రహదారిలో వివిధ రకాల వృక్షాలు కనువిందు చేస్తున్నాయి. పెదగదిలి కూడలి నుంచి ముడసర్లోవ పార్కు మీదుగా వెళ్లే బీఆర్‌టీఎస్ మార్గం వెంబడి గల అందమైన చెట్లు స్థానికులు, ప్రయాణికులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో పచ్చపచ్చని రంగుల్లో మెరుస్తూ కనిపిస్తున్నాయి.

\- ఆరిలోవ

ఆటాడుకుందాం.. రా!



వీఎంఆర్‌డీఏ పార్కులో బాస్కెట్‌బాల్ ఆడుతున్న పిల్లలు

వీఎంఆర్‌డీఏ పార్కులో చిన్నారుల సందడి

ఏయూక్యాంపస్: పుస్తకాలతో నిత్యం గడిపే చిన్నారులకు కాస్త విరామం దొరికింది. పాఠశాలలకు వేసవి సెలవులు ఇవ్వడంతో పూర్తిస్థాయిలో ఆటపాటలతో గడుపుతున్నారు. బీచ్ రోడ్డులోని వీఎంఆర్‌డీఏ పార్కులో చిన్నారులు ఆటపాటలతో సందడి చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కులోని మైదానాలన్నీ చిన్నారులతో సందడిగా కనిపిస్తున్నాయి. షటిల్ కోర్టు, బాస్కెట్‌బాల్ కోర్టు, స్కేటింగ్ రింక్‌ల్లో చిన్నారులు సాధన చేస్తూ చెమటోడుస్తున్నారు. నిత్యం ఇలా ఆటపాటలతో గడపడం వల్ల శారీరక వ్యాయామంతోపాటు మానసిక వికాసం సాధ్యపడుతోంది. అనారోగ్యాల బారిన పడకుండా శారీరకంగా ధృడంగా ఉండటానికి ఆటలు ఉపకరిస్తున్నాయి. విద్యతోపాటు తమకు నచ్చిన క్రీడలో రాణించే విధంగా పిల్లలకు సమయం లభించింది. మరికొంత మంది వేసవి ప్రత్యేక శిక్షణ శిబిరాల్లో చేరి ఆటపాటలను, విజ్ఞాన అంశాలు, కళలో తర్ఫీదు పొందుతున్నారు. చిన్నారులు తమ వేసవి సెలవులను ఎంతో ఉపయుక్తంగా మార్చుకుంటున్నారు.



షటిల్ ఆడుతున్న చిన్నారులు





స్కేటింగ్ సాధన చేస్తున్న చిన్నారులు

చందనోత్సవంలో అపశృతి సహించరాని అపరాధం

ఏయూక్యాంపస్: నిర్లక్ష్యపు నీడలో సింహాచలం దేవస్థాన అధికారులు ఉన్నారని ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు లగుడు గోవిందరావు ఆరోపించారు. బీచ్ రోడ్డులో బుధవారం ఆయన మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజల ప్రాణాలు పోవడం విచాకరమన్నారు. ఉత్తరాంధ్రులు అమితంగా కొలిచే వరాహ లక్ష్మీనృసింహ స్వామి చందనోత్సవంలో అపశృతి దొర్లడం సహించరాని అపరాధమని మండిపడ్డారు. గోడ కూలి ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోందన్నారు. ఈ సంఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని, కేంద్ర, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు, రాష్ట్రపతి, గవర్నర్‌లకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. మృతి చెందిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని, వారి కుటుంబీకులకు రెగ్యులర్ ఉద్యోగం కల్పించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

అప్రకటిత కరెంట్ కోతలతో అవస్థలు



ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో అప్రకటిత విద్యుత్ కోతలతో జనం సతమతమవుతున్నారు. నిత్యం ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో కరెంట్ పోవడంతో నివాసులు అవస్థలు పడుతున్నారు. ఒకవైపు వేసవి తీవ్రత.. మరోవైపు వేళాపాళా లేకుండా కరెంట్ కట్ చేయడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గంటల తరబడి విద్యుత్ లేకపోవడంతో ఉక్కపోతతో గడుపుతున్నారు. చిన్నారులు, వృద్ధులు ఇంట్లో ఉండలేకపోతున్నారు.

జీవీఎంసీ 9, 10, 11, 12, 13 వార్డుల్లోని ఆరిలోవ దుర్గాబజార్, దుర్గానగర్, శ్రీకాంత్‌నగర్, టీఐసీ పాయింట్, బాలాజీనగర్, రవీంద్రనగర్, తోటగరువు, సంతపాలెం, గాంధీనగర్, అన్నానగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో ప్రతి రోజూ ఏదో ఒక సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. అసలే వేసవి ఎండలు మండిపోతున్న తరుణంలో ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని, పోని ఇంట్లో ఉందామంటే విద్యుత్ లేక ఉక్కపోతతో సతమతమవుతున్నామని ఆరిలోవ ప్రాంత వాసులు చెబుతున్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోయినా.. నెల ప్రారంభమయ్యే సరికి కరెంట్ బిల్లులు మాత్రం మోత మోగిస్తున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ప్రతి రోజూ అప్రకటిత కోతలు కొనసాగుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. విద్యుత్ విభాగం అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కోరుతున్నారు.

‘నవ జీవన వైతాళికులు’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కె.ఎస్.చలం, సాహితీవేత్తలు

సీతమ్మధార: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శత వసంతాల రచయిత్రి రాజమ్ కృష్ణన్ రచించిన ‘నవ జీవన వైతాళికులు’ పుస్తకావిష్కరణ సభ బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. బసు పోతన ఆహ్వానం పలకగా.. సభాధ్యక్షుడు ఉప్పల అప్పలరాజు స్వాగతోపన్యాసం చేశారు. సాహితీవేత్త, నాటక కర్త పాలిమెరశెట్టి ఫ్రాన్సిస్ శ్రీశ్రీ జయభేరి కవితను వినిపించారు. అరసం 90 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఎస్.హనుమంతరావు అరసం చరిత్రను వివరించారు. ముఖ్య అతిథి యూపీఎస్సీ పూర్వ చైర్మన్ ప్రొఫెసర్ కె.ఎస్. చలం పుస్తకాన్ని ఆవిష్కరించి, రచయితకు అభినందనలు తెలిపారు. పుస్తకంలోని మహిళల ఆర్థిక సమానత్వం గురించి మాట్లాడారు. విమర్శకుడు ఆచార్య చందు సుబ్బారావు కవితా శైలిని విశ్లేషించారు. ఏయూ తెలుగు శాఖ ప్రొఫెసర్ డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ పుస్తక సమీక్ష చేసి మాట్లాడుతూ దివంగత రాజమ్ కృష్ణన్ అనుభవాలు, అభిప్రాయాలతోపాటు గొప్ప అంశాలు ఈ పుస్తకంలో ఉన్నాయన్నారు. మరో సమీక్షకురాలు అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.సుధ మాట్లాడుతూ రాజమ్ కృష్ణన్ రష్యాలో విహరించి, తన ఆలోచనలను పుస్తకంలో పొందుపరిచారన్నారు. ప్రచురణ కర్త మానవ హక్కుల వేదిక కార్యకర్త పోలిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ ప్రజా నాట్య మండలి గురించి వివరించారు. సోషలిస్ట్ సమాజంలో మహిళా ఎలా ఉండాలో ఈ పుస్తకం చెబుతుందన్నారు. కార్యక్రమంలో కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు, సాహితీవేత్త డాక్టర్ డి.వి.సూర్యారావు, విశాఖ రచయితల సంఘం అధ్యక్షుడు అడపా రామకృష్ణ, రచయిత బండి సత్యనారాయణ, కథా రచయిత మేడా మస్తాన్ రెడ్డి, పద్యకవి సిహెచ్.చిన సూర్యనారాయణ, రాధారాణి, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.